జగన్ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి

- టీడీపీ హయాంలో అభివృద్ధి గ్రాఫిక్స్‌లకే పరిమితం
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- రూ.55 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు


బోర్వంచలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, ఎంపీ అభ్యరి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్

నూజివీడు: టీడీపీ హయాంలో అభివృద్ధి కేవలం గ్రాఫిక్స్‌కే పరిమితమైతే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి నియోజకవర్గంలో వందల కోట్ల సంక్షేమం, అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలో మొత్తం రూ.55 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించగా పలు నిర్మాణాలకు ఆయన ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. బోర్వంచ, పోతురెడ్డిపల్లి, ముక్కొల్లుపాడు, తూర్పు దిగవల్లి, హనుమంతులగూడెం, తుక్కులూరు, దేవరగుంట, మర్రిబంధం, ఎంఎన్‌పాలెంలలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజీ హెల్త్‌క్లినిక్‌ల భవనాలు సిమెంట్ రోడ్లను ప్రారంభించగా జల్‌జీవన్ మిషన్ పనులు, పలు తారురోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల రూపంలో దాదాపు రూ.11 వందల కోట్లు ప్రజలకు అందించామన్నారు. 10 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహాలను మంజూరు చేశామన్నారు. వీటికి తోడు నాడు–నేడు పథకంద్వారా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను నిర్మించామన్నారు. గ్రామాల్లో సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజి క్లినిక్‌ల భవనాలను నిర్మించామని, వీటికి తోడు మంచినీటిని అందించేందుకు జల్ జీవన్ మిషన్ ద్వారా లక్షలాది రూపాయలతో తాగు నీటి పైప్‌లైన్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం, ఆర్అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. ఇదంతా అభివృద్ధి కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభ్యున్నతి కోసం అహర్నిశలూ పాటుపడుతున్నారన్నారు. దాదాపు రెండేళ్ల పాటు కరోనాతో రాష్ట్ర ఆదాయం పూర్తిగా పడిపోయినా లబ్ధిదారులకు నిరంతరం సంక్షేమ పథకాలను అందించినట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం రుణమాఫీ హామీని డ్వాక్రా మహిళలు, రైతులను నట్టేట ముంచేసిందన్నారు. ఇప్పుడు చెప్పేవన్నీ కూడా దొంగ హామీలని వాటిని ఎవరూ నమ్మొద్దని అన్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకు తీసుకెళ్లారన్నారు. పేదల సంక్షేమం కోసం పార్టీలకు అతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలబడాలని కోరారు. జెడ్పీ వైస్‌చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ, విద్యామౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, నాయకులు అక్కినేని ప్రేమ సాయి, ఆరేపల్లి రాంబాబు, బసవరాజు నగేష్, పల్లే రవీంద్రరెడ్డి, పాలడుగు విజయ్‌కుమార్, అచ్చి కాసులు, పల్నాటి రఘు, పంచాయతీరాజ్ ఈఈ బాపిరెడ్డి, ఎంపీడీవో కిరణ్‌కుమార్, వద్దాది త్రినాథ్‌రావు, బోయపాటి ప్రతాప్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదల సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యం



తిరువూరు: ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. స్థానిక 13వ వార్డులో శనివారం మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను రాజకీయాల కతీతంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చేతివృత్తులు, కుల వృత్తుల వారికి ప్రోత్సాహకాలను అందిస్తూ పెన్షన్లు, ఆర్థిక సాయం అందజేస్తోందని, గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ అండగా నిలిచిందని స్వామిదాసు పేర్కొన్నారు. పాత తిరువూరులోని 13వ వార్డులో యానాదుల సమస్యలను తెలుసుకున్నారు. పార్టీ నాయకులు నాయని కోటేశ్వరరావు, కాలసాని విజయలక్ష్మి, రవి, జాకీర్, రమాదేవి పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



మునుకుళ్ళ(తిరువూరురూరల్): త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలపై ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై మండలంలోని మునుకుళ్ల గ్రామ సచివాలయం వద్ద శనివారం ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంపై ఓటువేసినపుడు తీసుకునే జాగ్రత్తలను అధికారులు వివరించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో బ్యాలెట్ పత్రాలను ఈవీఎంలో అమర్చడం, అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు, ఓటుహక్కు రశీదు వచ్చే విధానాన్ని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



విస్సన్నపేట: పేదల సంక్షేమమే లక్ష్యంగా ఇచ్చిన హామీలకు మించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం–1 వద్ద విస్సన్నపేట టౌన్‌లో మంజూరైన జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి స్థలం దస్తావేజులను శనివారం అందజేశారు. 278 మందికి నివేశన స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వటం జరిగిందన్నారు. గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు రెడ్డి ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, పార్టీ నాయకులు పిల్లి రాజేష్, సాధుపాటి కోటేశ్వరరావు, దస్తగిరి, ఇన్‌చార్జి ఈఓ మురళి పాల్గొన్నారు.

పంటల బీమా జాబితాపై సామాజిక తనిఖీ



వేదాద్రి (జగ్గయ్యపేట): రైతులు విధిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ భవాని సూచించారు. గ్రామంలోని సచివాలయంలో 2023–24 పంట కాలానికి సంబంధించి ఈ క్రాప్ చేసిన రైతు జాబితా సామాజిక తనిఖీ గ్రామ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ క్రాప్ చేసిన రైతుల జాబితా సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహిస్తారన్నారు. రైతులు జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలను ఈనెల ఐదు లోపు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, వీఏఏలు ఫణి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కంచికచర్ల: రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం వాహనదారులను హెచ్చరించారు. స్థానిక నెహ్రూ బొమ్మసెంటర్‌లో శనివారం సాయంత్రం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరిమితికి మించి అతివేగంగా, మద్యం తాగి వాహనాలను నడుపరాదన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోవడంతో 25 మంది వాహనదారులకు మూడు వేల రూపాయలు జరిమానా విధించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు ఉపేంద్ర, రోజారావు, కార్తీక్ పాల్గొన్నారు.

నేడు రెండు పోలియో చుక్కలు వేయించండి


చెక్కపల్లిలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ


ఊటుకూరులో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

నూజివీడు: ఈనెల మూడోతేదీన ఆదివారం ప్రభుత్వం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. సున్నా నుంచి ఐదేళ్ల లోపు వయస్సు కలిగిన చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు నూజివీడు డివిజన్‌లో వైద్యశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. డివిజన్ వ్యాప్తంగా ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులు 36,254 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. వారందరికీ పోలియో చుక్కలు వేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేశారు. డివిజన్‌లోని 13 పీహెచ్‌సీలు, 2 యూపీహెచ్‌సీల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు 352 పోలియో బూత్‌లను ఏర్పాటు చేశారు. 70 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించడంతో పాటు 34 రూట్‌లను ఏర్పాటు చేసి 34 మంది సూపర్‌వైజర్‌లను నియమించారు. డివిజన్ పరిధిలో ఉన్న 1,21,015 గృహాలను సందర్శించేందుకు 760 టీంలను నియమించారు. ఆదివారం పోలియో బూత్‌ల వద్దకు వచ్చి పోలియో చుక్కలు వేయించుకున్న తరువాత సిబ్బంది 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు. బస్టాండులు, ఇటుకబట్టీలు, తోటలలో కాపలా ఉండే ప్రాంతాలను గుర్తించి వీరి పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జాస్తి జగన్‌మోహన్‌రావు పర్యవేక్షించనున్నారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే ఈ పల్స్‌పోలియో కార్యక్రమంలో ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని పీహెచ్‌సీల వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా కోరారు. మండలంలోని ముసునూరు, రమణక్కపేట, చెక్కపల్లిల్లో పీహెచ్‌సీల సిబ్బంది, ఆశ వర్కర్లతో కలిసి శనివారం పల్స్‌పోలియో అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ముసునూరు పీహెచ్‌సీ పరిధిలో 2,426 మంది, రమణక్కపేట పీహెచ్‌సీ పరిధిలో 2,226 మంది, మొత్తం 4,652 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వారు తెలిపారు. పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించడానికి 50 టీమ్‌లు, 3 సంచార బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వారు కోరారు. హెచ్ఎంలు అబ్బాస్, రామకృష్ణారావు, హెల్త్ సూపర్‌వైజర్లు మురళీమోహన్, అలెగ్జాండర్, కృష్ణారావు, అర్జునరావు, పీహెచ్ఎన్ రత్నకుమారి, హెచ్‌వీలు హెప్సీబా, సీతమ్మ, ఈ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జాస్తి జగన్మోహన్‌రావు తెలిపారు. మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 5,392 మందికి పోలియో చుక్కలు వేసేందుకు 40 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

తిరువూరురూరల్: జాతీయ పల్స్ పోలియో సందర్భంగా 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ చుక్కల మందు వేయించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో పిల్లలకు తల్లిదండ్రులు చుక్కల మందు వేయించాలని కోరారు. మునుకుళ్ళ, చౌటపల్లి, రాజుగూడెం, అక్కపాలెం, కాకర్ల, లక్ష్మీపురం, ఎర్రమాడు, కొమ్మిరెడ్డిపల్లి, పెద్దవరం, కోకిలంపాడు, మల్లేల, రోలుపడి, చిట్టేల, ఆంజనేయపురం గ్రామాల్లో జరిగిన అవగాహన ప్రదర్శనల్లో ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలవరం: మండలంలోని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేయనున్నట్లు చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జీ ప్రియాంక తెలిపారు. మండలంలో మొత్తం 5476 మంది చిన్నారులు ఉన్నారని, వీరికి 38 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక వాహనాలలో నాలుగు రూట్స్, హై రిస్క్ ఏరియాలలో సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారన్నారు.

గంపలగూడెం: పిల్లలకు తప్పని సరిగా ఆదివారం పోలియో చుక్కలు వేయించాలని గంపలగూడెం, ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శృతి, శశిప్రియ తెలిపారు. పీహెచ్‌సీల పరిధిలో పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2,465 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకై 19 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు శృతి వివరించారు. ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2,130 మంది పిల్లలకు పోలియో చుక్కల కోసం 21 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం


నూజివీడులో ఎంటీ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

నూజివీడు: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవగా, 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. తొలిరోజు భాషా సబ్జెక్టులైన తెలుగు, హిందీ, సంస్కృతం సబ్జెక్టులకు పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, ఇయర్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ డివైస్‌లను అనుమతించలేదు. ఈ పరీక్షకు పట్టణంలోని ఐదు కేంద్రాల్లో కలిపి 1380 మంది విద్యార్థులకు గాను 1339 మంది విద్యార్థులు హాజరయ్యారు. 41 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. మదుపల్లి తాతయ్య జూనియర్ కళాశాలలో 352 మందికి 341 మంది, సెయింట్ ఆన్స్ కళాశాలలో 249 మందికి 241 మంది, శ్రీ శారద జూనియర్ కళాశాలలో 278 మందికి 270 మంది, శ్రీవాగ్దేవి జూనియర్ కళాశాలలో 280 మందికి 274 మంది, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 221 మందికి 213 మంది పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్ఎంలను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద తహసీల్దార్ ఏవీ శాస్త్రి 144వ సెక్షన్‌ను అమలు చేసి పోలీసుల సిబ్బందిని నియమించారు. ఆయా కళాశాలల పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా దుర్గా ప్రసాద్, టీ విజయ, ఉమాదేవి, సీహెచ్ జాన్, చంద్రశేఖర వర్మ వ్యవహరించారు.

విస్సన్నపేట: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు విస్సన్నపేటలో డీకేఎన్‌పి (సిద్ధార్థా), వికాస్, శ్రీశ్రీ,కేఏవమ్మార్ అండ్ ఎమ్మెస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. శనివారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షకు 1,287మంది విద్యార్థులు హాజరుకాగా,33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

తిరువూరు: ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తిరు వూరులోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 838 మంది విద్యార్థులను కేటాయించగా, 24 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 264మందికి 253, సాంఘిక సంక్షేమ గురు కుల కళాశాలలో 195 మందికి 186, శ్రీనిధి కాలేజీలో 204 మందికి 203, నాగార్జున జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 175 మంది విద్యార్థులకు 172 మంది హాజరయ్యారు. మొదటిరోజు తెలుగు, హిందీ, సంస్కృతం సబ్జెక్టులతో పాటు వొకేషనల్ విద్యార్థులకు జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్ష నిర్వహించారు.

బైక్, కారు ఢీకొని ఒకరికి గాయాలు

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుంటుపల్లి 65వ నెంబర్ హైవేపై యూటర్న్ తీసుకుంటున్న సమయంలో శనివారం ఈ ఘటన జరిగింది. ఇబ్రహీంపట్నంకు చెందిన తోలేటి శ్రీనివాసరావు వ్యక్తిగత పనులపై గొల్లపూడి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గుంటుపల్లి చేరుకుని మళ్లీ గొల్ల పూడి వెళ్లేందుకు హైవే మధ్య యూటర్న్ తీసుకుంటున్న సమయంలో వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. ఘటనలో శ్రీనివాసరావు తలకు గాయమైంది. 108 వాహన సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ బి.అనూష కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్ట్

ఆగిరిపల్లి: వేర్వేరుచోట్ల పేకాడుతున్న జూదరులు 15 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సురేంద్రకుమార్ చెప్పారు. మండలంలోని నెక్కలం గొల్లగూడెం గ్రామ సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై శనివారం తమ సిబ్బందితో దాడి చేసి 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఆగిరిపల్లిలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని రూ.550 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

జీకొత్తూరు(తిరువూరురూరల్): 2023–24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూలు వేగవంతం చేయాలని తిరువూరు మండల పరిషత్ పంచాయతీల విస్తరణాధికారి వెంకటరత్నం సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని జీకొత్తూరు సచివాలయంలో శనివారం పన్నుల వసూలు ప్రక్రియపై సమీక్ష జరిపారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోడానికి తగు చర్యలు చేపట్టాలని కోరారు. సర్పంచి వెంకట్రావమ్మ పాల్గొన్నారు.

ఎంచుకున్న రంగాల్లో నిష్ణాతులు కావాలి


విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, శోభనాద్రీశ్వరరావు

మైలవరం: విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో నిష్ణాతులు కావాలని ఎల్‌బీఆర్‌సీటీ ట్రస్టీ, ప్రవాసాంధ్రుడు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల 26వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుని తద్వారా కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చేలా కష్టపడాలన్నారు. కళాశాల కో ఫౌండర్, హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి మెరిట్ విద్యార్థులకు రూ.27,00,000 మెరిట్ స్కాలర్‌షిప్స్‌ని అందజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, లకిరెడ్డి ప్రసాదరెడ్డి, గోగులమూడి సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు ప్రసంగించారు. వివిధ రకాల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మెరిట్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, లకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వేమిరెడ్డి వెంకటరెడ్డి, గోగులమూడి సత్యనారాయణ రెడ్డి, మైలవరం జమీందారు ఎస్వీ నివృతరావు, కేతిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలివే ఉత్సవాల నిర్వహణకు పందిరి రాట


బలివేలో పందిరి రాటా వేస్తున్న అర్చకులు, పెద్దలు

ముసునూరు: చారిత్రక ప్రసిద్ధ బలివేలోని శ్రీరామలింగేశ్వర ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే నూజివీడు ఆర్డీఓ భవానీశంకరి ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేయగా, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఏర్పాట్లను పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు. తాజాగా శనివారపు శుభ ఘడియల్లో ఆలయ అర్చకులు తోలేటి అరుణభాస్కర్, చావలి అమర్‌బాబు మంత్రోచ్ఛరణల నడుమ భక్తి శ్రద్ధలతో పూజ నిర్వహించి, పందిరి రాటా (గుంజ)వేసి పందిర్లు, క్యూలైన్ల ఏర్పాట్ల పనులు ఆరంభించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఆలయ కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈఓ సతీష్ కుమార్, స్థానిక పెద్దలు పిల్లి రెడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ఆగిరిపల్లి: సురవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆదివారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇంజినీరింగ్ అసోసియేషన్ పాలకవర్గం ఎన్నిక

ఇబ్రహీంపట్నం: ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ పాలకవర్గం ఎన్నిక ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో శనివారం జరిగింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికలో బ్రాంచి కార్యదర్శిగా కేవీఆర్ చక్రపాణి, కోశాధికారి యు.వెంకటరావు గెలుపొందారు. ఎన్టీటీపీఎస్ డీఈఈ సీహెచ్ శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఎన్టీటీపీఎస్‌కు చెందిన ఉద్యోగులు, అధికారులు అభినందించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చాట్రాయి: మండలంలోని చనుబండ–నరసింహారావుపాలెం గ్రామాల మధ్య వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా నిర్వహించి భజనలు చేశారు. అనంతరం రెండు వేల మందికి అన్నదానం చేశారు.

123 మంది రైతులకు వైద్య పరీక్షలు


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తోటమూల(గంపలగూడెం): పాడి రైతులు శ్రేయస్సు కోసం కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తుందని తిరువూరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి తెలిపారు. మండలంలోని తోటమూల విశిష్ట జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం పాడి రైతులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబశివమూర్తి మాట్లాడుతూ పాడి రైతులకు ఆరోగ్య సమస్య ఎదురవ్వకుండా కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో ఆస్టర్ రమేష్ అమరావతి, అకిరా ఆసుపత్రులకు చెందిన వైద్యులు కిషోర్, ప్రశాంత్‌బాబు, హరేష్, వేణుగోపాల్, సాదిక్‌లు శిబిరంలో 123 మంది రైతులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. సూపర్వైజర్ ప్రసాద్, పలు పాలకేంద్రాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మక ద్రోహులు పార్టీకి రాజీనామా చేయాలి

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ బీఫారంతో గెలిచి నమ్మక ద్రోహులుగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో పాటు టీడీపీలో చేరిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీకి రాజీనామా చేయకుండా టీడీపీ కండువా కప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నంలో జరిగిన సమావేశంలో శనివారం ఆమె మాట్లాడుతూ అప్పుడు పార్టీ బీఫారం కోసం పాకులాడిన నాయకులు ఇప్పుడు వ్యక్తిగతంగా గెలిచామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గెలిచిన ప్రతి ఒక్కరూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి కష్టార్జితంపై గెలిచినవారే అని గుర్తు పెట్టుకోవాలన్నారు. ధైర్యం ఉంటే రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల బిక్షతో గెలిచిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి అధినేత ఆదేశాల మేరకు ఎందరో నాయకులకు పనిచేశామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంత సాంబశివరావు అన్నారు. ఎంపీపీ పార్టీ వీడటం ఆమె విజ్ఞతకే వదిలేశామని, పార్టీ విజయానికి కట్టుబడి పనిచేస్తామన్నారు. పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారాబట్టీపై దాడి, ఇద్దరి అరెస్ట్


తిరువూరు సర్కిల్లో లభ్యమైన కాపుసారా, బెల్లపు ఊట

తిరువూరు: సారా తయారుచేసి విక్రయిస్తున్న ఇరువురిని తిరువూరు ఎస్ఈబీ అధికారులు శనివారం అరెస్టు చేశారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి, నర్మదానగర్ గ్రామాల్లోని పొలాలు, అటవీ ప్రాంతాల్లో సారా తయారవుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఈబీ అధికారులు దాడులు జరపగా, తండాకు చెందిన బాణావతు రమేష్, కల్పనలు సారాతో పట్టుబడ్డారు. 50 లీటర్ల సారాను వారి నుంచి స్వాధీనం చేసుకుని సారా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా, గంజాయిల వినియోగం, అమ్మకాలతో అనర్థాలు వివరిస్తూ గ్రామంలో ప్రదర్శన చేశారు.